ఈనాడు కామారెడ్డి

శనివారం అక్టోబరు 19, 2024

మాటు వేసి.. మాట కలిపి.. మోసం చేసి

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

సైబర్ నేరగాళ్లు రోజుకోతీరున ఎత్తులు వేస్తూ మోసం చేస్తున్నారు. భయపెడుతూ, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇటీవల సాంకేతికంగానూ వల విసురుతున్నారు. సామాజిక మాధ్యమాల గ్రూపుల్లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారు. వీటిని ఇన్‌స్టాల్ చేసుకుంటే వినియోగదారుడి సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కే ప్రమాదముంది. జాగ్రత్తతోనే వీటిని అరికట్టవచ్చు. జిల్లాలో ఇటీవలి ఘటనలు, సూచనలతో కథనం.

సైబర్ నేరాల నివారణకు అప్రమత్తతే రక్ష

☛ ఇలా చేస్తే మేలు

కాల్ చేస్తారు.. ఓటీపీ చెప్పమంటారు
లింక్ పంపుతారు.. యాప్ వాడమంటారు
ఓటీపీ చెప్పినా.. యాప్ ఓపెన్ చేసినా..
మీ ఖాతాలో డబ్బు మాయమే



కామారెడ్డికి చెందిన ఎల్లగంటి భానుప్రకాష్‌కు ఇటీవల సైబర్ నేరగాళ్లు కాల్ చేసి అతడి క్రెడిట్ కార్డుకు సంబంధించిన ట్రాన్సాక్షన్ ఆన్‌లో ఉందని నమ్మించారు. ఆఫ్ చేయాలంటే ప్లే స్టోర్ నుంచి ఓ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని చెప్పారు. వారు చెప్పినట్లు చేశాడు. వివరాలు తెలిపాడు. వెంటనే బాధితుడి బ్యాంకు ఖాతాలోంచి రూ.1.50 లక్షలను కాజేశారు.

☛ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన వివరాలను ఎవరితో పంచుకోకూడదు. ఎవరో చెప్పిన యాప్‌లు ఇన్‌స్టాల్ చేయవద్దు. ఓటీపీలు చెప్పకూడదు. అవసరం ఉంటే సంబంధిత కార్యాలయానికి వెళ్లాలి.

తక్కువ ధర అంటారు.. బ్రాండ్ వస్తువని నమ్మిస్తారు
ఇంటికి పంపుతామని మాటల్లో పెట్టి మాయ చేస్తారు
ఆశపడి సంప్రదించినా.. డబ్బులు పంపినా
అవతలి ఫోన్ స్విచ్ఛాఫ్



బీబీపేట మండలం ఇస్సానగర్‌కు చెందిన సురేష్‌చారి ఐపాడ్ కొనుగోలు చేయాలని ఇంటర్‌నెట్‌లో వెతికాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన చూసి అక్కడున్న చరవాణి నంబరును సంప్రదించాడు. తక్కువ ధరకే ఐపాడ్ ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు సురేష్‌చారి నుంచి వారి ఖాతాలోకి రూ.61,180 బదిలీ చేయించుకున్నారు. ఐపాడ్ పంపకపోవడంతో బాధితుడు ఆగస్టులో ఫిర్యాదు చేశాడు.

☛ అంతర్జాలంలో వచ్చే ప్రకటనలు, అపరిచితులు చెప్పే మాటలను నమ్మితే మొదటికే మోసం వస్తుంది. గుర్తింపు కలిగిన సంస్థల నుంచే వస్తువులను కొనుగోలు చేయాలి.

మీ ఇంటివాళ్లు ఆపదలో ఉన్నారు
ఓ కేసులో ఇరుక్కున్నారు
బయటపడే మార్గం ఉందంటారు
చెప్పినట్టు చేస్తే.. నిండా ముంచేస్తారు



పల్వంచ మండలం భవానిపేటకు చెందిన వెంకట్‌రెడ్డి చరవాణికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. 'అమెరికాలో ఉంటున్న మీ కూతురు హత్య కేసులో ఇరుక్కుంది. అరెస్టయితే బయటకు రాదు. మీ బిడ్డ బయటపడాలంటే రూ.2 లక్షలు పంపాలి' అని బెదిరించారు. వెంకట్‌రెడ్డి భయపడి వారు చెప్పినట్లు రూ.లక్ష పంపించాడు. తర్వాత కూతురు కాల్ చేసి కేసులేమీ లేవని తెలిపింది.

☛ పోలీసు, అవినీతి నిరోధక శాఖ అధికారులమంటూ డబ్బులు అడుగుతూ, బెదిరిస్తూ నేరగాళ్లు మోసాలు చేస్తున్నారు. సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడాలి.

మీరు ఎంతో 'అదృష్టవంతులు'
లక్షల మందిలో మీరే బహుమతి గెలిచారు
త్వరపడండి.. అడిగిన డబ్బు పంపండి
చెప్పినట్టు చేస్తే.. అవుతారు 'దురదృష్టవంతులు'



ఖరీదైన కారును బహుమతిగా గెలుచుకున్నారంటూ బీర్కూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన యువతి చరవాణికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. అతడి మాటలు నమ్మిన ఆమె బహుమతిని తనకు ఎప్పుడు, ఎలా పంపిస్తారని ఆరా తీసింది. రవాణా, జీఎస్టీ ఛార్జీల పేరిట రూ.45 వేలు చెల్లించాలని అడగగా.. ఆన్‌లైన్లో పంపింది. బహుమతి రాకపోవడంతో మోసపోయానని గ్రహించింది.

☛ మన ప్రమేయమే లేకుండా బహుమతిని గెలుచుకోవడం అనేది అసాధ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలి. ఇదంతా సైబర్ మోసమని ముందే పసిగట్టాలి.

ఈ ఏడాదిలో అక్టోబరు 17 వరకు ఇదీ పరిస్థితి
జిల్లాలో నమోదైన సైబర్ కేసులు : 800
పోగొట్టుకున్న మొత్తం : రూ.2.80 కోట్లు
పోలీసులు నిలువరించిన కేసులు : 300
బాధితులకు అప్పగించింది : రూ. 45 లక్షలు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో సైబర్ నేరాల కట్టడికి నిరంతరం కృషి చేస్తున్నాం. ప్రత్యేకంగా డీఎస్పీ స్థాయి అధికారి పనిచేస్తున్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌ను నియమించి ప్రజలకు నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. నేరగాళ్లు కొల్లగొట్టిన డబ్బును బాధితులకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏం చేయాలంటే..

మోసపోయామని గుర్తించిన బాధితులు వెంటనే 1930కు, డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. www.ncrp.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే ఫిర్యాదు చేయడం వల్ల పోయిన సొమ్మును పోలీసులు రాబట్టే అవకాశం ఉంది.

సామాజిక, ఆర్థిక గణనకు కసరత్తు

ఈనాడు, కామారెడ్డి

ఎన్యుమరేటర్ల వివరాల సేకరణలో ప్రణాళికశాఖ

సామాజిక, ఆర్థిక గణన చేపట్టేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో విడుదల చేసింది. ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రెండు రోజుల క్రితం ప్రభుత్వ మౌలిక ఆదేశాలతో ఇంటింటి సర్వే చేపట్టేందుకు అవసరమైన ఎన్యుమరేటర్ల గుర్తింపు, కుటుంబాల నిర్ధారణ ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది.

క్షేత్రస్థాయి సిబ్బందితో..

● స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం బీసీ కులగణన చేపట్టాలని తొలుత భావించారు. తర్వాత సమగ్ర సమాచార సేకరణ నిమిత్తం సామాజిక, ఆర్థిక గణన చేపట్టాలని నిర్ణయించారు. ● ప్రభుత్వ క్షేత్రస్థాయి సిబ్బందిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేస్తున్నారు. ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, ఏఈవోలు, ఇతర శాఖల్లోని గ్రామ, వార్డు స్థాయి సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ● ఒక్కో 150 గృహాలను యూనిట్‌గా తీసుకుంటున్నారు. ఒక్కో యూనిట్‌కు ఒక ఎన్యుమరేటర్‌కు బాధ్యతలు అప్పగించనున్నారు. ● కేంద్ర ప్రభుత్వం 2011లో నిర్వహించిన జనగణన వివరాలను వినియోగించిన గ్రామ, వార్డు స్థాయి మ్యాపుల ఆధారంగా ప్రస్తుత సామాజిక ఆర్థిక గణనను పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని ఉన్న మ్యాపులు సేకరిస్తున్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఆయా మ్యాపుల వినియోగించడం ద్వారా వివరాల సేకరణలో కచ్చితత్వం లోపించే అవకాశముందని యంత్రాంగం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది.

ప్రభుత్వానికి నివేదిక

సామాజిక ఆర్థిక గణనలో ప్రతి కుటుంబానికి సంబంధించి కులం, ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర అంశాలు సేకరించనున్నారు. ప్రభుత్వ పథకాలతో ఏ విధంగా లబ్ధిపొందుతున్నారనే వివరాలు సైతం తెలుసుకోనున్నారు. వీటిని క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీ, ఎస్సీలలో ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, బీసీల కోటాను నిర్ధారించనున్నారు. సామాజిక ఆర్థిక గణనకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉందని సీపీవో ఆర్.రాజారాం పేర్కొన్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం వివరాలు

★ మొత్తం జనాభా : 9,74,227 ★ పురుషులు : 4,79,192 ★ మహిళలు : 4,95,035 ★ ఎస్సీ జనాభా 1,53,678 ★ ఎస్టీ జనాభా : 81,956

పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు : కలెక్టర్

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రూప్- 3 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వీసీలో కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాలో గ్రూప్- 3 పరీక్షలకు 20 కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 8300 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. స్ట్రాంగ్‌రూంలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకంపై హైకోర్టు ఉత్తర్వులు



భిక్కనూరు, న్యూస్‌టుడే: ఇటీవల ప్రభుత్వం నియమించిన బస్వాపూర్, కాచాపూర్ సింగిల్ విండోల పర్సన్ ఇన్‌ఛార్జులు ఎలాంటి ప్రాధాన్యత, వివాదాస్పద నిర్ణయాలు తీసుకోరాదని, సాధారణ పరిపాలన కార్యాకలాపాలు మాత్రమే నిర్వహించాలని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల బస్వాపూర్ సింగిల్ విండోను బస్వాపూర్, కాచాపూర్ సొసైటీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసింది. అనంతరం ఈ నెల 10న బస్వాపూర్ సొసైటీకి మల్లారెడ్డి, కాచాపూర్ సొసైటీకి కిష్టాగౌడ్‌ను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో బస్వాపూర్ సొసైటీ మాజీ వైస్ ఛైర్మన్ మద్ది స్వామి, డైరెక్టర్లు రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజిరెడ్డి, నర్సింలు హైకోర్టును ఆశ్రయించారు. పర్సన్ ఇన్‌ఛార్జుల నియామకం నిబంధనలకు విరుద్ధమని వారు తెలిపారు. ఈ విషయమై డీసీవో రామ్మోహన్‌ను వివరణ కోరగా తనకు హైకోర్టు ఉత్తర్వులు అందలేదని తెలిపారు.

నిజాంసాగర్ వరద గేట్ల మూసివేత

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గిపోవడంతో ప్రధాన వరద గేట్ల నుంచి నీటి విడుదలను నిలిపివేసినట్లు జలవనరులశాఖ ఏఈఈ శివ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి సాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 3000 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో నీటిపారుదల శాఖ గేట్ల నుంచి 500 క్యూసెక్కులు నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేసినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.90 అడుగులు (17.658 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



నిండుగా ఉన్న నిజాంసాగర్ జలాశయం

పొదల్లో ప్రయాణ ప్రాంగణం

చుట్టూ పొదలు, పిచ్చి మొక్కల చాటున కనిపించకుండా ఉన్న ఈ భవనం పల్వంచ మండలం ఆరెపల్లి ప్రయాణ ప్రాంగణం. ప్రయాణికులు అందులో వేచి చూసే పరిస్థితి లేక ప్రాంగణం ఎదుట ఉన్న పార్టీల దిమ్మెలపై కూర్చుంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మాచారెడ్డి



నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ బదిలీ

డిచ్‌పల్లి ఏడో బెటాలియన్ కమాండెంట్ కూడా..



కల్మేశ్వర్ : రోహిణి

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ శింగెనవార్ బదిలీ అయ్యారు. నేషనల్ పోలీసు అకాడమీకి డిప్యుటేషన్ చేస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సతీమణి, 7వ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని కూడా బదిలీ అయ్యారు. హైదరాబాద్ డీజీపీ కార్యాలయం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చాక ఇద్దరు రిలీవ్ కానున్నారు. కల్మేశ్వర్ శింగెనవార్ 10 అక్టోబరు 2023లో సీపీగా బాధ్యతలు స్వీకరించారు. సొంత శాఖ ఉద్యోగులు తప్పు చేసినా.. ముక్కుసూటిగా వ్యవహరిస్తూ విధుల్లో తనదైన ముద్ర వేశారు. ప్రమాదాల కట్టడి, కేసుల ఛేదన, నియమ నిబంధనలు పాటింపు విషయంలో కచ్చితంగా వ్యవహరించారని పేరొందారు.

తెవివికి వీసీ వచ్చారు..!



న్యూస్‌టుడే, తెవివి క్యాంపస్

ఉపకులపతిగా ఆచార్య యాదగిరిరావు

తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఎట్టకేలకు ఉపకులపతి వస్తున్నారు. తెవివికి ఆచార్య టి.యాదగిరిరావును నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇన్‌ఛార్జి పాలనకు తెరపడింది. గతంలో వీసీగా పని చేసిన ఆచార్య రవీందర్ గుప్తా గతేడాది జూన్ 17న హైదరాబాద్‌లోని స్వగృహంలో వర్సిటీ పరిధిలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రానికి అనుమతి ఇచ్చేందుకు రూ.50 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడ్డారు. అప్పటి నుంచి ఐఏఎస్ అధికారులే వర్సిటీకి ఇన్‌ఛార్జి వీసీగా కొనసాగారు. 16 నెలలుగా ఇన్‌ఛార్జులతో వర్సిటీ అభివృద్ధిలో విధానపరమైన నిర్ణయాలు అమలుకాలేదు. రెగ్యులర్ వీసీ నియామకం కావడంతో ఇకపై వర్సిటీ పరిపాలన, అకడమిక్ వాతావరణం గాడిన పడుతుందని ఉద్యోగులు, విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వర్సిటీతో గతంలో అనుబంధం..

తెవివికి రెగ్యులర్ వీసీగా వస్తున్న ఆచార్య యాదగిరిరావు గతంలో ఇక్కడ సోషల్ సైన్సెస్ డీన్‌గా రెండున్నరేళ్లు పని చేశారు. ఆయన వివాహం సైతం నిజామాబాద్‌లోనే జరిగింది. జిల్లా, వర్సిటీతో అనుబంధం, పట్టు ఉన్న వ్యక్తి వీసీగా వస్తున్నారు. తెవివి ఆవిర్భావం నుంచి నలుగురు రెగ్యులర్ వీసీలు పని చేశారు. కాశీరాం 6, నవంబరు 2006 - 3, నవంబరు 2009, అక్బర్ అలీ ఖాన్ 15, జులై 2011 - 14, జులై 2014, సాంబయ్య 25, జులై 2016 - 24, జులై 2019 వరకు పని చేశారు. రవీందర్‌గుప్తా 22, మే 2021న వీసీగా బాధ్యతలు చేపట్టి 17, జులై 2023న ఏసీబీకి పట్టుబడ్డారు. యాదగిరిరావు ప్రస్తుతం వరంగల్ జిల్లాకు చెందిన ఆచార్య యాదగిరిరావు అయిదో రెగ్యులర్ వీసీగా నియమితులయ్యారు.

ఆయన ప్రస్థానం ఇలా...

యాదగిరిరావు స్వస్థలం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి. కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రంలో తొలి ఉద్యోగి. కాకతీయ వర్సిటీలో 2004లో అధ్యాపకుడిగా చేరి.. ప్రస్తుతం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సీనియర్ ఆచార్యులుగా కొనసాగుతున్నారు. యూజీసీ సమన్వయకర్తగా, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతిగా, బీవోఎస్‌గా పని చేశారు. 33 ఏళ్ల బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఈయన మార్గనిర్దేశంలో 21 మంది పీహెచ్‌డీ, తొమ్మిది మంది ఎంఫిల్ పట్టా పొందారు. దిల్లీలో యూజీసీ మేజర్ ప్రాజెక్టు పూర్తి చేశారు. 2021లో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్నారు. 17 అంతర్జాతీయ, 29 జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్సులకు హాజరయ్యారు.

ఉచిత బియ్యం మరో నాలుగేళ్లు

గరీబ్ కల్యాణ అన్న యోజన పథకం పొడిగింపు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే

రేషన్ లబ్ధిదారులకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం పంపిణీ చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ అన్న యోజన పథకం కింద పేదలకు బియ్యం అందజేస్తుంది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఈ పథకాన్ని 2028 డిసెంబరు వరకు అమలు చేయనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,55,591 రేషన్‌కార్డుదారులకు లబ్ధి కలగనుంది. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు ఐదు కిలోల చొప్పున బియ్యం అందిస్తున్నారు.

2021 నుంచి..

కరోనా విపత్తు సమయం నుంచి కేంద్రం రేషన్ లబ్ధిదారులకు ఉచిత బియ్యం అందిస్తోంది. అంతకు ముందు కిలోకు ఒక్క రూపాయి చొప్పున డబ్బులు తీసుకుని బియ్యం పంపిణీ చేశారు. రెండేళ్ల పాటు ప్రతి మూడు నెలలకోసారి పథకం గడువు పొడిగిస్తూ వెళ్లారు. ఆ తర్వాత 2023లో ఏడాది పాటు పథకాన్ని పొడిగించిన ప్రభుత్వం తాజాగా మరో నాలుగేళ్ల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది.

కార్డుల వివరాలు
కామారెడ్డి - 2,53,548
నిజామాబాద్: 4,02,043

పోషకాల మిళితం

రేషన్‌లబ్ధిదారులకు కేంద్రం ఏడాదికాలంగా పోషక బియ్యం పంపిణీ చేస్తుంది. సాధారణ బియ్యంలో పోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపి సరఫరా చేస్తున్నారు. ఒక క్వింటాల్ సాధారణ బియ్యానికి కిలో పోర్టిఫైడ్ బియ్యం కలుపుతున్నారు. మిల్లింగ్ చేసి బస్తాల్లో నింపేటప్పుడే పోర్టిఫైడ్ బియ్యాన్ని కలిపే విధంగా అన్ని మిల్లుల్లో బ్లెడింగ్ యంత్రాలు అందుబాటులోకి తెచ్చారు. ఈ బియ్యం ద్వారా ఐరన్, పోలిక్ యాసిడ్, విటమిన్- బీ వంటి పోషకాలు అందుతున్నాయి.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికే పల్లెబాట



అవగాహన కల్పిస్తున్న ఏస్ఈ రమేష్‌బాబు, అధికార బృందం

తాడ్వాయి, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్తు సమస్యలను పరిష్కరించేందుకే ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమం చేపట్టినట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎస్ఈ రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సంగోజివాడిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో వంగిపోయిన విద్యుత్తు స్తంభాలను, వేలాడుతున్న తీగలను సరిచేశారు. డీఈ చక్రవర్తి, ఏఈ కరుణాకర్ పాల్గొన్నారు.

పల్లె రోడ్లకు మహర్దశ

సీఆర్ఆర్ నిధులు రూ. 50 కోట్లు కేటాయింపు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

పల్లె రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం సీఆర్ఆర్ (నియోజకవర్గ రూరల్ రోడ్లు) కింద జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు రూ.50 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో జిల్లావ్యాప్తంగా మొత్తంగా 44 పనులను పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టనున్నారు. గతంలో ప్రతి ఏడాది ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్లను నిర్మించేవారు. ప్రస్తుతం ప్రత్యేకంగా పల్లె రోడ్లకోసం సర్కారు నిధులను మంజూరు చేయడం గమనార్హం.

కామారెడ్డి నియోజకవర్గానికి తక్కువ : బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు రూ.15 కోట్ల చొప్పున, కామారెడ్డి నియోజకవర్గానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాలకు ప్రభుత్వం ఎక్కువ నిధులు మంజూరు చేసింది. జిల్లాలో ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నుంచే విజయం సాధించారు. ఇక బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం భారాస నుంచి విజయం సాధించి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఈ మూడు నియోజకవర్గాలకు నిధులు అధికంగా కేటాయించారు. కామారెడ్డి నియోజకవర్గంలో కాటిపల్లి వెంకటరమణారెడ్డి భాజపా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండడంతో తక్కువ నిధులు కేటాయించినట్లు ప్రచారం జరుగుతోంది.

గ్రంథాలయ పనులకు మోక్షమెన్నడు?

న్యూస్‌టుడే, బాన్సువాడ

మినీస్టేడియంలో ఉద్యోగార్థుల తిప్పలు

డివిజన్‌లోని ఉద్యోగార్థులకు పెద్ద దిక్కుగా ఉన్న బాన్సువాడ గ్రంథాలయానికి శాశ్వత భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భవనం శిథిలావస్థకు చేరడంతో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొత్త భవనానికి నిధులు మంజూరు చేశారు. పాత భవనం కూల్చేశారు. తర్వాతి కాలంలో ప్రభుత్వం మారడంతో భవనం పనులు ప్రారంభం కాలేదు.

దెబ్బతింటున్న ఏకాగ్రత..

గ్రంథాలయాన్ని ప్రస్తుతం పట్టణంలోని మినీస్టేడియంలో ఏర్పాటు చేశారు. క్రీడా పోటీల నిర్వహణ, పక్క గదిలోనే బస్తీ దవాఖానా ఉండడంతో చదువుకోవడానికి వచ్చిన నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇబ్బందుల నడుమే ఇక్కడ చదువుకున్న సుమారు 16 మంది ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు, గురుకుల ఉపాధ్యాయులుగా మరో ఐదుగురు ఎంపికయ్యారు. క్రీడాకారులు ఆడుతుండటం, బస్తీ దవాఖానాకు రోగులు రావడంతో ఏకాగ్రత దెబ్బతింటుందని కొందరు ఉద్యోగార్థులు అభిప్రాయపడుతున్నారు. మరిన్ని వసతులు ఉంటే ఉద్యోగాలు పొందేవాళ్లమని చెబుతున్నారు. శాశ్వత భవన నిర్మించాలని కోరుతున్నారు.



బాన్సువాడ గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్న ఉద్యోగార్థులు

పెరుగుతున్న సంఖ్య..

గ్రంథాలయానికి ప్రస్తుతం గ్రూప్-1, 2, 3 పరీక్షలు రాసే వారు వస్తున్నారు. బాన్సువాడ, వివిధ మండలాల నుంచి రోజుకు 150 మంది వచ్చి చదువుకుంటున్నారు. ప్రభుత్వం మరిన్ని పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొనడంతో గ్రంథాలయానికి వచ్చేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ల్యాబ్‌టెక్నీషియన్ తదితర పోస్టులకు సిద్ధమవుతున్నవారూ వస్తున్నారు. ఈ విషయంపై బాన్సువాడ గ్రంథపాలకుడు సుధాకర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. 'శాశ్వత భవనం లేక ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. స్థానిక ఎమ్మెల్యే చొరవతో మినీస్టేడియంలో విద్యార్థులకు కొంత వసతులు ఏర్పాటు చేయించారు. నిధులు మంజూరైనా గుత్తేదారు ఆలస్యంతో భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి' అని అన్నారు.

రోడ్లపైనే వ్యాపారాలు

☛ తప్పని ట్రాఫిక్ తిప్పలు

పరిశీలన

ఎక్కడికక్కడ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేయడంతో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో పాదచారులు నడవడానికి సైతం ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది.

అంబులెన్సులు వెళ్లలేక..

● 1.50 లక్షల పైనే ◆ 40 ■ 4 ☛ 15

నిజామాబాద్ నగరంలోని గాంధీచౌక్ నుంచి ప్రధాన బస్టాండ్ వరకు ఎక్కడికక్కడ వ్యాపారులు ఆక్రమణలు చేశారు. ఖలీల్‌వాడిలో రోడ్లపైనే తోపుడు బండ్లు, నడక మార్గంపైన కుర్చీలు వేసి వ్యాపారం చేస్తున్నారు. ఆటోలు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో నగరంలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. జీజీహెచ్ వద్ద అంబులెన్సులు వెళ్లటానికి ఇబ్బందిగా ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం


గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్లపైనే తోపుడు బండ్లు

● నిత్యం రాకపోకలు ◆ రద్దీ ప్రాంతాలు
■ పార్కింగ్ స్థలాలు ☛ అనువైన ప్రాంతాలు

ఇష్టారీతిన పార్కింగ్

● 10 వేలు ◆ 5 ■ లేవు ☛ 4

పట్టణంలోని ప్రధాన రహదారి వెంట రోడ్ల మీద పార్కింగ్‌తో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో వాహనాలు నిలపడంతో ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించడంతో పాదచారులు అవస్థలు పడుతున్నారు. దీనిపై కమిషనర్ శ్రీహరి రాజును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పోలీసు శాఖ వారితో కలిసి ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.



- బాన్సువాడ పట్టణం

పార్కింగ్ స్థలాలు లేక..

● 60 వేలు ◆ 10 ■ లేవు ☛ 6

ఏటా కామారెడ్డి జిల్లా కేంద్రం పరిధితో పాటు వాహనాల సంఖ్య పెరగడంతో పార్కింగ్ స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో పార్కింగ్ జోన్ల ఏర్పాటు కొలిక్కి రావడం లేదు. నాలుగేళ్ల క్రితం కొత్తబస్టాండు, సుభాశ్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, జేపీఎన్‌రోడ్డు, సిరిసిల్లరోడ్డు, ఇందిరాచౌక్ తదితర రద్దీ ప్రాంతాల్లో అధికారులు పరిశీలన చేసి దుకాణ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత క్షేత్రస్థాయికి వచ్చి సమస్య పరిష్కారానికి అడుగులు వేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయమై టీపీవో గిరిధర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పార్కింగ్ జోన్ల విషయమై గతంలోనే స్థలాల ఎంపికకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి దృష్టి పెడతామన్నారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం


కామారెడ్డిలో సుభాశ్‌రోడ్డులో రహదారి మధ్యలో వాహనాలు

ఐదు నెలలుగా బిల్లులు రావట్లే

న్యూస్‌టుడే, కామారెడి వైద్యవిభాగం, కలెక్టరేట్

రక్తపరీక్షల కోసం ఆరోగ్యకేంద్రాల నుంచి నమూనాలు సేకరించి కామారెడ్డి టీహబ్‌కు వాహనాల్లో తెస్తున్నారు. వాహనాలకు సంబంధించి బిల్లులు ఏడు నెలలుగా రాక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు రెండు నెలల బిల్లుల చెల్లింపులకు మాత్రమే ప్రొసీడింగ్స్ వచ్చాయి. అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాల్సి ఉన్నా స్పందన కరవైంది.



ఐదు వాహనాలు.. 12500 కి.మీ

టీ హబ్ పరిధిలో ఐదు వాహనాలు ఉన్నాయి. ఇవి నిత్యం ఐదు మార్గాల్లో నమూనాలు సేకరిస్తున్నాయి. ఒక్కో వాహనం నెలకు 2500 కి.మీ రాకపోకలు సాగించింది. ఒక్కో వాహనానికి సంబంధించి రూ.33 వేల చొప్పున బిల్లులు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రూ.8.25 లక్షలు చెల్లించాలి. బిల్లులు మంజూరు చేయాలని సిబ్బంది పలుమార్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు మొరపెట్టుకున్నా స్పందన కరవైంది. కొంతకాలం ద్విచక్రవాహనాలపై సిబ్బంది పీహెచ్‌సీలకు వెళ్లి నమూనాలను సేకరించారు. రాష్ట్రశాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. దసరా పండగ వరకు బకాయిలు వస్తాయని ఆశతో నిరీక్షించిన వారికి నిరాశే మిగిలింది. ఈ విషయమై న్యూస్‌టుడే వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా.. ఇప్పటికే రెండు నెలలకు సంబంధించి బకాయిల చెల్లింపులకు అనుమతి వచ్చిందన్నారు. మిగతా బిల్లుల చెల్లింపులపై దృష్టి పెడతామన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతుల్లో పరిమిత సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ సత్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశాలకు...ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ 01-05-2010 నుంచి 31-07-2012 మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్‌లో చేరేవారు... ప్రస్తుతం పదో తరగతి చదువుతూ 01-06-2008 నుంచి 31-07-2010 మధ్య జన్మించి ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8వ తేదీన ఉంటుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

ఆదాయం ఘనం... వసతులు శూన్యం...

☛ కాలభైరవుని సన్నిధిలో సౌకర్యాలు లేక భక్తుల ఇబ్బందులు...

న్యూస్‌టుడే, ఇస్సన్నపల్లి(రామారెడ్డి), ఎల్లారెడ్డి గ్రామీణం

దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన కాలభైరవ స్వామి ఆలయంలో కనీస వసతులు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మంగళవారం ఆలయానికి వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు సరిగా లేక నానా తంటాలు పడుతున్నారు.


అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

ఉత్సవాల సమయానికి పూర్తయ్యేనా..?

నవంబరులో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆ వేడుకలకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు వస్తారు. అధిక సంఖ్యలో మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంతో అటువైపు వెళ్లడానికి భక్తులు జంకుతున్నారు. ప్రతి రెండు, మూడు నెలలకు హుండీ ఆదాయం రూ.3 నుంచి 4లక్షల వరకు వస్తున్నా సౌకర్యాల కల్పనలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆలయ పరిసరాలలో చెత్తా చెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

..ప్రభు రాంచంద్రం, ఈవో

ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం. గ్రామస్థులు, దాతల సహకారంతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశాం. ఆలయ గదులలో పైపులైన్లు, మరుగుదొడ్ల మరమ్మతు పనులు త్వరలో పూర్తి చేయిస్తాం. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసుతులు కల్పిస్తాం.


రేకుల షెడ్డులోనే దుస్తులు మార్చుకునే గదులు

క్రీడలతో శారీరక దృఢత్వం

రామారెడ్డి, న్యూస్‌టుడే: క్రీడలతోనే విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ అన్నారు. గురువారం రామారెడ్డిలో ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. అండర్- 14 బాలుర విభాగంలో రామారెడ్డి బాలికల పాఠశాల ప్రథమ, రామారెడ్డి బాలుర పాఠశాల ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బాలికల విభాగంలో విద్యానికేతన్ కామారెడ్డి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ అన్నారం ద్వితీయ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఈశ్వర్, మోహన్ రెడ్డి, నాగరాజు, చంద్రయ్య, నరసింహారెడ్డి, నరేశ్‌రెడ్డి, నాజ్మా, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్

బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో కామారెడ్డికి గుర్తింపు

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో కామారెడ్డి బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు అఫిలియేషన్(గుర్తింపు) వచ్చిందని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బ్యాడ్మింటన్ కోర్టులో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 16న రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లెల గోపీచంద్ కామారెడ్డికి గుర్తింపు పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. 2018లో ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నో జిల్లా, రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం కామారెడ్డికి గుర్తింపు హోదా రావడంతో ఇకపై నిర్వహించే టోర్నీలకు రాష్ట్ర స్థాయి ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. జిల్లా ఉపాధ్యక్షుడు మహిపాల్ జైన్, కార్యదర్శి సురేశ్, ముప్పారపు ఆనంద్, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని గురుకుల బాలికల కళాశాల విద్యార్థిని కె. అంజలి రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ ఉష తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపల్ సంగీత అభినందించారు.

నేడు ఉద్యోగ మేళా


కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు నేడు(శనివారం) ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు కామారెడ్డి జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముథూట్ ఫైనాన్స్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగిన 21 నుంచి 30 ఏళ్లలోపు అభ్యర్థులు కలెక్టరేట్‌లోని రూంనెంబర్ 121లో నిర్వహించే మౌఖిక పరీక్షలకు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు నిజ ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మరింత సమాచారం కోసం 76719 74009, 70975 25933 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుల గడువు పొడిగించినట్లు కామారెడ్డి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు ఈ నెల 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



●●● కామారెడ్డి రుక్మిణికుంటలో చెత్త సేకరణ సిబ్బంది రావడం లేదు. - **ఆంజనేయులు, రుక్మిణికుంట**

●●● చెత్త సేకరణ చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



●●● జిల్లా కేంద్రంలోని అజంపురాలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - **ముక్తర్, అజంపురా**

●●● సిబ్బందితో వ్యర్థాలను తొలగించాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

●●● జిల్లా కేంద్రంలోని బడా కసాబ్‌గల్లీలో మురుగు కాల్వ పూడిక పేరుకుపోయింది. - **ప్రభాకర్, బడా కసాబ్‌గల్లీ**

●●● కాల్వ పూడికతీతకు చర్యలు చేపట్టాం. - **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



●●● బాన్సువాడలోని 5వ వార్డులో పలు చోట్ల చెత్త నిల్వలు రోడ్ల వెంట ఉండటంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. - **రవి, బాన్సువాడ**

●●● ఈ విషయాన్ని పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బంది చేత చెత్త తొలగింపజేసి సమస్య పరిష్కరించారు.



●●● రామారెడ్డి మండల కేంద్రంలోని ఏడో వార్డులో మురుగు కాలువలు తీయడం లేదని వారం రోజుల క్రితం మేమున్నాం మీకు తోడుగాలో సమస్య ప్రచురితమవగా పంచాయతీ కార్యదర్శి క్రాంతి స్పందించారు. సిబ్బందితో మురుగు కాలువలను తీయించారు. చెత్తచెదారాన్ని తొలగించి ప్రజల సమస్యను పరిష్కరించారు.

●●● తిమ్మానగర్ మహంకాళమ్మ వీధిలో ఉన్న బోరు మోటారు పదిహేను రోజులుగా మరమ్మతులకు గురవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నాం.
వినయ్‌కుమార్, తిమ్మానగర్

●●● మరమ్మతులు పూర్తవగానే మోటారు బిగించి సమస్య పరిష్కరిస్తాం. **సాయిబాబా, పంచాయతీ కార్యదర్శి, తిమ్మానగర్.**

సమస్య: అంచనూరు- సీతారాంపల్లి శివారులోని వ్యవసాయ భూములకు వెళ్లే ఫార్మేషన్ రోడ్డు దెబ్బతింది. ధాన్యం తేవడం ఇబ్బందిగా ఉంది.- **శేఖర్, సీతారాంపల్లి**

●●● గ్రామ సభలో తీర్మానం చేసి పనిచేయిస్తాం- **మనోహర్, ప్రత్యేకాధికారి, సీతారాంపల్లి**

●●● బిచ్కుంద 9వ వార్డులో గత కొంత కాలంగా భగీరథ నీరు రావడం లేదు.
పత్తి శ్రీనివాస్, 9వ వార్డు, బిచ్కుంద

●●● వార్డులో తాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటాను.
కౌశిక్, డీఈ

●●● పెద్దదేవాడ బస్టాండ్ సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.
సాయి కుమార్, పెద్దదేవాడ

●●● చెత్త ట్రాక్టర్ మరమ్మతులకు గురైంది. రెండు రోజుల్లో చెత్తను తీసివేసి, సమస్యను పరిష్కరిస్తాం.
ప్రిసిలా, పంచాయతీ కార్యదర్శి, పెద్దదేవాడ

-న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం,పిట్లం, కామారెడ్డి పట్టణం, బిచ్కుంద గ్రామీణం: దోమకొండ, బిచ్కుంద,రామారెడ్డి,

వ్యక్తి అదృశ్యం

పిట్లం: పిట్లంకు చెందిన నడిమింటి లాలయ్య ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కుమారుడు బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు.

ఉన్నత విద్యకు చేయూత

పిట్లం, న్యూస్‌టుడే: పెద్దకొడప్‌గల్ మండలం పోచారం తండాకు చెందిన ఖేతన్ గతేడాది నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించాడు. నిరుపేద కుటుంబం కావడంతో ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం అందించాలని కోరగా.. పిట్లంకు చెందిన కట్ట హరీశ్‌రెడ్డి (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి) ముందుకు వచ్చారు. నాలుగేళ్ల ఎంబీబీఎస్ పూర్తయ్యేదాకా ఏటా రూ.1.20 లక్షలు సహాయం అందిస్తానని ముందుకొచ్చి మొదటి ఏడాది ఆ మొత్తం అందజేశాడు. రెండో ఏడాది విద్యనభ్యసించేందుకు శుక్రవారం పిట్లంలో వైద్య విద్యార్థికి రూ.1.20 లక్షల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, దయానంద్, హుసేన్ ఉన్నారు.



ఖేతన్‌కు చెక్కు అందజేస్తున్న హరీశ్‌రెడ్డి



దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్



బాన్సువాడ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం


ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో దివ్య(ప్రథమ), మీనాక్షి(ద్వితీయ), మేఘన(తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్ బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, సమన్వయకర్త సంగయ్య పాల్గొన్నారు.

బాన్సువాడ: బాన్సువాడలోని బాలికల ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థినులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్‌మీడియా ప్రభావం అనే అంశాలపై నిర్వహించిన పోటీలో బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రథమ యశ్వంతి, ద్వితీయ ఆర్.లావణ్య, తృతీయస్థానాల్లో ఎస్.దివ్యలు నిలిచారు. వీరికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వరాజ్య లక్ష్మీ, రజిత, సంధ్యారాణి, సమన్వయకర్త నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు.

కుక్క కాట్లు... జనం పాట్లు...





ఈ చిత్రంలో కనిపిస్తోన్న చిన్నారి అల్లాపూర్‌కు చెందిన లాల్‌బీ శ్రీవాణి. పది రోజుల కిందట ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. పెద్దకొడప్‌గల్‌లో ఓ క్లినిక్‌లో ప్రథమచికిత్స అనంతరం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రూ.80వేల ఖర్చయ్యాయి.

న్యూస్‌టుడే,పిట్లం

శునకాల దాడితో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇంటి నుంచి కాలు బయటకు పెట్టాలంటే చిన్నారులు, మహిళలు, వృద్ధులు బెంబేలెత్తుతున్నారు. గత నెల వ్యవధిలో పిట్లంలో 20 మందిపై పిచ్చి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నా తగిన చర్యలు తీసుకోవడంలో యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ☛ పిట్లం మండల కేంద్రంలో ఉదయపు నడకకు వెళ్లే వారిపై గ్రామ సింహాల దాడులు నిత్యకృత్యంగా మారాయి. బాన్సువాడ రోడ్డులోని పై వంతెన వద్ద కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. ☛ పిట్లం మండలం అల్లాపూర్‌లో పది రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులు, మూడు గేదెలపై శునకాలు దాడి చేశాయి. ఒకరిని నిజామాబాద్, మరొకరిని బాన్సువాడకు తరలించారు. ☛ పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో నెల రోజుల కిందట నలుగురిపై దాడి చేసి గాయపర్చాయి. ☛ మద్నూర్, బిచ్కుందలో ఇటీవల పలువురిని గాయపర్చడంతో బాధితులు ఆస్పత్రుల పాలయ్యారు. ☛ పిట్లం ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో మందులు లేక బాధితులను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నారు. అన్ని రకాల సూది మందులు అందుబాటులో ఉంచేలా చూడాలని బాధితులు వైద్యాధికారులను కోరుతున్నారు.



అల్లాపూర్‌లో రహదారిపై కుక్కల గుంపు ఇలా

నియంత్రణ చర్యలు శూన్యం

చర్యలు చేపడతాం.

యాదగిరి, ఎంపీవో, పిట్లం.

పిట్లం మండలంలోని ఆయా గ్రామాల్లో శునకాల బెడద ఉన్న విషయం మాదృష్టికి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నివారణ చర్యలు చేపడతాం.



ఎమ్మెల్యే మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న పోచమ్మ రేవు రైతులు

నిధుల మంజూరుపై హర్షం

గాంధారి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని పోచమ్మ రేవు వద్ద వంతెన నిర్మాణంతో పాటు 2.5 కిలోమీటర్ల మేర బీటీ, లింగంపేట్ వరకు రోడ్డు పనులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ చొరవతో సీఆర్ఐఎఫ్ నిధుల ద్వారా రూ.4.98కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం గాంధారికి చెందిన పలువురు రైతులు హైదరాబాద్‌లోని నివాసంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ డైరెక్టర్ తాడ్వాయి సంతోష్, కాంగ్రెస్ నాయకులు బజారు సంతోష్, రైతులు గోపాల్, శ్రీనివాస్, విఠల్, రవి, నరేష్. సాయిలు, రవి, కుమార్, కాశీరాం, తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శనివారం నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్లారెడ్డి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదులను ప్రారంభించనున్నారని, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణంలో బాన్సువాడ ఆదర్శం

బాన్సువాడ, న్యూస్‌టుడే : ఇళ్ల నిర్మాణంలో దేశంలోనే బాన్సువాడ నియోజకవర్గం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీర్కూరు మండలం మల్లాపూర్‌కు చెందిన లబ్ధిదారులకు ఇంటి హక్కు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల నగదు ఇస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి, బీర్కూరు తహసీల్దార్ శ్రీలత, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు ఖాలెక్, రఘు, శశికాంత్, సురేష్, ఎజాస్, మోహన్‌నాయక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిన టీఎన్జీవో ప్రతినిధులు

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను టీఎన్జీవో ప్రతినిధులు శుక్రవారం పట్టణంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బాన్సువాడ సంఘం సభ్యులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, కోశాధికారి దేవరాజు, సంతోష్‌కుమార్, కామారెడ్డి అర్బన్ కార్యదర్శి శివకుమార్, బాన్సువాడ అధ్యక్షుడు శ్రీనివాస్, అజీముద్దీన్, అబ్దుల్ రజాక్, రవి, సుభాష్ తదితరులున్నారు.



బాన్సువాడలో ఇంటి హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ ఛైర్మన్ బాల్‌రాజ్



ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఐకాస ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. జగన్నాథం, సిద్ధిరాములు, డా.వి శంకర్, అంజయ్య, చంద్రశేఖర్, ఆజాద్, వీడీ దాస్, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల ఖాతాల్లోకి నగదు జమ

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల్లో ఫ్రీజ్ అయిన రూ.1.70 లక్షల డబ్బులను కోర్టు ఆదేశాలతో బాధితుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయించామని పోలీసులు వెల్లడించారు. తరచూ వచ్చే కాల్స్‌కు స్పందించొద్దన్నారు. ఓటీపీలు ఎవరికీ చెప్పరాదని వివరించారు.

వసతి గృహ విద్యార్థులను ఇంటికి పంపించేశారు..!

జుక్కల్, న్యూస్‌టుడే: జుక్కల్ ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులు దసరా సెలవులకు ఇంటికెళ్లి తిరిగి శుక్రవారం వసతి గృహానికి వస్తే.. సంక్షేమాధికారి లేరని, తమకు జ్వరం వస్తుందంటూ సిబ్బంది వాళ్లను తిరిగి ఇంటికి పంపించినట్లు తెలిసింది. కొన్నాళ్లుగా మద్నూర్‌లో విధులు నిర్వహించే సంక్షేమాధికారి వీరప్పకు జుక్కల్ వసతిగృహ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనకు ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం రావడంతో వసతిగృహానికి రాలేకపోయారు. ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బందిలో ఇద్దరికి జ్వరం వచ్చింది. ఈ నేపథ్యంలో దసరా సెలవులకు ఇంటికెళ్లి తిరిగి వసతిగృహానికి వచ్చిన విద్యార్థులను వెనక్కి పంపించినట్లు సమాచారం. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఇన్‌ఛార్జి సంక్షేమాధికారి వీరప్పను వివరణ కోరగా.. తనకు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చిన మాట నిజమేనని, ఇంకా రిలీవ్ కాలేదని, వేరే సంక్షేమాధికారికి బాధ్యతలు అప్పగించనున్నట్లు చెప్పారు. అక్కడ విధులు నిర్వహించే ఇద్దరి సిబ్బందికి జ్వరం వచ్చింది. వారి స్థానంలో వేరే వాళ్లు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకొన్నాం. విద్యార్థులు వసతిగృహానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.





వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు, బాలింతలు

అంబులెన్సు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : ఎల్లారెడ్డి మండలం మల్లాయిపల్లి, సాతెల్లి, గండిమాసినపేట, బాలాజీనగర్ తండాకు చెందిన గర్భిణులు, బాలింతలను 102 అంబులెన్సు సిబ్బంది శుక్రవారం కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. అత్యవసర సేవలను సద్వినియోగం చేసుకోవాలని 102 సిబ్బంది మోహన్, సతీష్‌లు కోరారు.

పాఠశాల ఏర్పాటు చేయాలని లేఖ

నిజాంసాగర్ వెనుకబడిన జుక్కల్ నియోజకవర్గంలోని నిజాంసాగర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకుడు పండరి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

గ్రామసభల్లోనే ఇందిరమ్మ కమిటీలు వేయాలి

సదాశివనగర్, న్యూస్‌టుడే : గ్రామ సభలు ఏర్పాటు చేసి గ్రామస్థుల సమక్షంలోనే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని సదాశివనగర్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు పడిగెల రాజేశ్వర్‌రావు శుక్రవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారని తక్షణమే వాటిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కమలాకర్ రావు, భారాస నాయకులు నర్సారెడ్డి, లింగం, భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అండర్ 14, 17 బాలుర, బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. హెచ్ఎం సాయి రెడ్డి, పీడీ దయాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో హెచ్ఎం సాయిరెడ్డి, పీడీ దయాకర్ రెడ్డి

పెండింగ్ డీఏలు తక్షణమే చెల్లించాలి

పిట్లం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డీఏలను తక్షణమే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పిట్లం, మార్దండ, ఖంబాపూర్, హస్నాపూర్, గోద్మెగావ్, కారేగావ్, చిన్నకొడప్‌గల్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సభ్యత్వం పొందిన ఉపాధ్యాయులకు రసీదులు అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లింగం, మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ నాగభూషణం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులకు రసీదులు ఇస్తున్న టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

ఆసుపత్రిపై దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని సమన్విత ఆసుపత్రిపై దాడి చేసి డబ్బులు డిమాండ్ చేసిన పాత్రికేయుడు విజయానంద్‌తో పాటు మరొకరిపై పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వైద్యుడు ప్రవీణ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వారు వెల్లడించారు.

కబ్జాదారులపై చర్యలకు డిమాండు

నాగిరెడ్డిపేట్,న్యూస్‌టుడే: పోచారం ప్రధాన కాల్వ గట్టును ఒక వ్యక్తి ఆరు సంవత్సరాలుగా కబ్జా చేసి పంటలు పండిస్తున్నారు. తగిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం గ్రామానికి చెందిన జగన్‌రెడ్డి మండల ఇరిగేషన్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న నిరసన తెలిపారు. దీనిపై డీఈ వెంకటేశ్వర్లును వివరణ కోరగా... త్వరలో సర్వే చేసి హద్దులను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.



నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద నిరసన

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బిచ్కుంద గ్రామీణం: బిచ్కుంద సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బిచ్కుంద, దడ్గి, సిర్‌సమందర్, గోపన్‌పల్లి, రాజుల్లా, దౌల్తాపూర్ గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

'పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ'

రామారెడ్డి, న్యూస్‌టుడే: పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీయేనని మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్ అన్నారు. గురువారం రామారెడ్డి మండల కేంద్రంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. వర్కింగ్ అధ్యక్షుడు శిలాసాగర్, కిషన్‌యాదవ్, శ్రీశైలం, చింతకుంట కిషన్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ అధ్యక్షతన 34 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. నాయకులు ఎల్లమయ్య, రఫియోద్దీన్, మోహిద్, రాజు, ప్రసాద్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసే వరకు పోరాటం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి వివేకానందకాలనీలో సీతారామాంజనేయ ఆలయ భూమిని ట్రస్ట్ పేరిట అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు కొండా అశోక్‌గుప్తా అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లుగా ఆలయానికి అధ్యక్షుడిగా పని చేసినవారు రూ.లక్షల లెక్కలు సక్రమంగా చూపలేదన్నారు. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసేంత వరకు పోరాడుతామన్నారు. కౌన్సిలర్ మోటూరి శ్రీకాంత్ తదితరులున్నారు.

ప్రవేశాలపై అవగాహన కల్పించాలని ఆదేశం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాల్లో ప్రవేశాలపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కార్మిక, ట్రైనింగ్ ఫ్యాక్టరీ ప్రిన్సిపల్ కార్యదర్శి సంజయ్‌కుమార్ శుక్రవారం నిర్వహించిన వీసీ అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో ఆరు కోర్సులకు సంబంధించిన సీట్ల వివరాలను ప్రచారం చేయాలని సూచించారు. కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఐటీఐ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐటీఐ కన్వీనర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

పీఆర్ ఏఈగా శ్రీకాంత్‌రెడ్డి

జుక్కల్, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ శాఖ జుక్కల్ ఏఈగా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం డీఈఈ మధుబాబు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. జుక్కల్ మండల స్థితిగతులను వివరిస్తూ.. నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరించారు. నాయకులు సాయాగౌడ్, బొంపెల్లి రాములు, వాగ్మరే సురేష్, కృష్ణ చాకలి, సాయికర్ణ, విఠల్, దేవిదాస్, తదితరులు ఉన్నారు.

వరికోత వాహనం ఢీకొని దుర్మరణం

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: వరికోత వాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మెదక్ మండలంలోని మంబోజిపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామీణ ఠాణా ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా గుండారం గ్రామానికి చెందిన షేక్ ఆరీఫ్ గత ఏడాది ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నాడు. మంబోజిపల్లి మార్కెట్ వద్ద బజ్జీల బండి పెట్టుకుని కుటుంబ సభ్యులను పోషిస్తున్నాడు. శుక్రవారం అక్కడే బండి పెట్టుకోగా వెనుక నుంచి వచ్చిన వరికోత వాహనం ఢీకొనడంతో కిందపడిపోయాడు. అతన్ని భార్య మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. డ్రైవర్ కాశ్మీర్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుల్తానా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

బాన్సువాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయికృపనగర్‌కు చెందిన కానిస్టేబుల్ సురేష్(43) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కొంతకాలం నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన బీర్కూరు ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



సురేష్

తాడ్వాయి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన మరాఠి రాకేష్ (22) చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వ్యక్తి పైకి దూసుకెళ్లిన కారు

రామాయంపేట, న్యూస్‌టుడే: మద్యం మత్తులో రహదారిపై పడి ఉన్న ఓ వ్యక్తిపై కారు దూసుకెళ్లిన ఘటన రామాయంపేటలో శుక్రవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం..ఓ వ్యక్తి మద్యం మత్తులో పట్టణంలోని సిద్దిపేట చౌరస్తాలో పడి ఉన్నాడు. అదే సమయంలో ఓ కారు అటువైపు మరలుతూ అతనిపైకి దూసుకెళ్లింది. దీంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు, స్థానికులు ప్రాథమిక చికిత్స కోసం పేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన ఎల్లయ్యగా గుర్తించారు.

రోడ్డు ప్రమాదం: ఇద్దరికి గాయాలు

జుక్కల్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పిట్లం నుంచి బిచ్కుంద వైపు వెళ్తున్న కారు, బిచ్కుంద నుంచి కేమ్‌రాజ్‌కల్లాలి గ్రామానికి వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కేమ్‌రాజ్‌కల్లాలి గ్రామానికి చెందిన లక్ష్మణ్, అతని భార్య తలకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకొన్న హైవే పెట్రోలింగ్ పోలీసులు విచారణ చేపట్టారు.

బాలికపై అత్యాచారం

బీర్కూర్, న్యూస్‌టుడే : బీర్కూర్ మండలానికి చెందిన బాలికపై ఓ వ్యక్తి అత్యాచారం చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున బాలిక ఇంటి పక్కన ఉన్న మరుగుదొడ్డికి వెళ్లింది. అదే సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తి (36) మరుగుదొడ్డిలోకి ప్రవేశించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. సదరు నిందితుడిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.